సాక్షి
సంగారెడ్డి

సోమవారం : 20 : నవంబర్ : 2023



కాంగ్రెసోళ్ల మాటలు నమ్మొద్దు

బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ఆపార్టీ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. వివరాలు 10లో ▸



బీఆర్ఎస్‌ను గెలిపించండి

బీఆర్ఎస్‌కు ప్రజలు మద్దతు ఇచ్చి గెలిపించాలని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు విజ్ఞప్తి చేశారు. వివరాలు 11లో ▸



ప్రజాసంక్షేమమే లక్ష్యంగా..

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

152 కేసులు..
రూ.4.69 కోట్లు సీజ్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఇప్పటివరకు 152 కేసుల్లో రూ.4,69,20,238లు సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి శరత్ ఆదివారం తెలిపారు. ఇప్పటివరకు 50 వేల రూపాయలకు మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న 152 మంది వ్యక్తుల నుంచి రూ.4,69,20,238లు సీజ్ చేశామని పేర్కొన్నారు. సరైన ఆధారాలు సమర్పించిన 138 మందికి 3,18,21,238 రూపాయల నగదు విడుదల చేశామని వివరించారు. మిగతా 14 కేసుల్లో మూడు కేసులను ఆదాయ పన్ను శాఖకు రిఫర్ చేసినట్టు తెలిపారు. ఇందులో 11 కేసులకు సంబంధించిన వారు సరైన ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పించి నగదు విడుదల చేసుకోవాలని సూచించారు. ఏమైన సందేహాలుంటే నివృత్తి కోసం కమిటీ సెల్‌ను సంప్రదించవచ్చని విజ్ఞప్తి చేశారు.

స్ట్రాంగ్ రూం,
కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

సిద్దిపేటఅర్బన్: పొన్నాల ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి జనరల్ అబ్జర్వర్లు జయశ్రీ భోజ్, మన్మోహన్‌ప్రసాద్ సందర్శించారు. నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్ల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలు ఉంచడానికి ఐరన్ ర్యాక్‌లు, సీసీ కెమెరాలు, కౌంటింగ్ కేంద్రాలలో ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఏర్పాట్ల బాధ్యత రిటర్నింగ్ అధికారులదేనని, రోజు పనులను పర్యవేక్షించాలని ఆర్వోలకు సూచించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూంకు తరలించడానికి, స్ట్రాంగ్ రూంలో భద్రపరిచే వరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు.

భర్త మద్యం తాగుతున్నాడని..
భార్య ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: భర్త మద్యాన్ని తాగుతున్నాడని భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన సతీశ్‌కుమార్ తరచూ మద్యం తాగుతున్నాడు. వద్దని భార్య చౌడేశ్వరి ఎన్నోసార్లు చెప్పినా పెడచెవిన పెట్టాడు. పైగా శనివారం స్నేహితులతో కలిసి ఇంట్లో మద్యం తాగాడు. దీంతో అదేరోజు రాత్రి భార్య చౌడేశ్వరి(33) బెడ్ రూమ్‌లోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చౌడారం వాసికి
ఐరావతం అవార్డు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చౌడారం గ్రామానికి చెందిన వాస్తు, జ్యోతిష్య పండితులు కటుకోజ్వల ఆనందం పంతులుకు ఐరావతం అవార్డు వరించింది. పోలా ప్రగడ కళానిలయం వారు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా జాతీయ స్థాయిలో సాహిత్యంలో రాణిస్తున్న ఆనందం పంతులను అవార్డుతో పాటు ఘనంగా సన్మానించారు. పలువురు సాహితీ వెత్తలు ఘనంగా సన్మానించారు.

జాతీయస్థాయి కరాటేలో
విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ: జాతీయస్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు రెంజుకి షోటోకాన్ కరాటే ఇండియా వ్యవస్థాపకుడు, డైరెక్టర్, సీనియర్ కరాటే మాస్టర్ నగేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం మెద్చల్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో యూనివర్సల్ 369 షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో సీఎంఆర్ మెమోరియల్ 2వ జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి 1500 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ కరాటే పోటీలకు దినకర్ కోచ్‌గా వ్యవహరించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొన్న మెదక్ విద్యార్థులు పృథ్వీక, సుహానిక, తన్వి, శ్రేయస్, కార్తీక్ ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు.

ఇంటి నుంచే ఓటు

- జిల్లాలో 200 మందికే అవకాశం
- అవగాహన లేమితో దరఖాస్తు చేసుకోని అర్హులు
- అధికారులు ఓటర్లను గుర్తించకపోవడం కూడా ఓ కారణం



నారాయణఖేడ్/ సంగారెడ్డి టౌన్: ఈ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ లక్ష్యంగా ఎన్నికల సంఘం సంస్కరణలతో ముందుకు సాగుతోంది. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు చర్యలు చేపడుతోంది. 80 ఏళ్ల పైబడ్డ వృద్ధులు, 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని ఎన్నికల సంఘం గుర్తించింది. వీరికి ఇంటి నుంచి ఓటువేసే విధానానికి అవకాశాన్ని కల్పించింది. గతంలో కేంద్ర, ఎన్నికల విధుల్లో ఉండే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించింది. తొలిసారిగా రాష్ట్రంలో ఇంటి నుంచే ఓటేసేందుకు అవకాశం కల్పించింది. ఇందుకుగాను ఈనెల 8 వరకు ఫారం 12డి ద్వారా దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. గడువులోపు అందినవి పూర్తిస్థాయిలో పరిశీలించారు. జిల్లాలోని సంగారెడ్డి నియోజకవర్గంలో వృద్ధులు, దివ్యాంగులు కలిపి 65 మంది, అందోల్ నియోజకవర్గంలో 51, పటాన్‌చెరులో 55, నారాయణఖేడ్‌లో 17, జహీరాబాద్‌లో 12 మందిని రిటర్నింగ్ అధికారులు ఆమోదించారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న ఓటర్ల ఇంటికి వెళ్లనున్నారు. ఒక్కో పోలింగ్ బృందంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి, పోలీసు సిబ్బంది, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. పోలింగ్ బూత్ మాదిరిగా కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసి రహస్యంగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఇంటి వద్దనే ఏర్పాటు చేస్తారు. ఈ ప్రక్రియను అంతా వీడియో చిత్రీకరణ చేయనున్నారు. ఈ ఓటును సీల్ చేసి తహసీల్దార్ కార్యాలయం ద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి పంపిస్తారు. ఇలా సేకరించిన బ్యాలెట్ ఓట్లను నిర్ణీత సమయానికి లెక్కింపు కేంద్రానికి తీసుకెళతారు.

అవగాహనా లోపం

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచి ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించినా బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో ఆయా ఓటర్లను గుర్తించలేకపోవడంతోపాటు అవగాహన లేమితో చాలా మంది అర్హత ఉన్నా దరఖాస్తు చేసుకోలేదని తెలిసింది. ఈనెల 8వ తేదీతో దరఖాస్తు గడువు ముగిసింది. తర్వాత తెలుసుకొని ఆయా వ్యక్తులు ప్రయోజనం లేకపోయింది. బూత్‌స్థాయి అధికారుల వద్ద వృద్ధులు, దివ్యాంగుల వివరాలు అందుబాటులో ఉన్నా పూర్తిస్థాయిలో శ్రద్ధ పెట్టినట్లు కన్పించడం లేదని సమాచారం. పట్టణాల్లోనే చాలామంది అర్హులున్నా దరఖాస్తు చేసుకోలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. జిల్లాలో దివ్యాంగులు పటాన్‌చెరు 2,490, అందోల్ 3,893, నారాయణఖేడ్ 4,524, సంగారెడ్డి 2,948, జహీరాబాద్‌లో 2,287మంది ఉండగా, వృద్ధులు పటాన్‌చెరులో 2,796, అందోల్‌లో 2,141, నారాయణఖేడ్‌లో 1,870, సంగారెడ్డిలో 1,795, జహీరాబాద్‌లో 2,349 మంది ఉన్నారు. కాగా నియోజకవర్గాల వారీగా దరాఖాస్తు చేసుకున్న వారి సంఖ్య అత్యల్పంగా ఉంది.

బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతి గట్టు

- మాది అభివృద్ధి చేసే గట్టు
- ఆదిలాబాద్–ఖేడ్–పటాన్‌చెరుకు రైల్వేలైన్ తీసుకొస్తాం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

నారాయణఖేడ్: బీఆర్ఎస్, కాంగ్రెస్‌లది అవినీతి, ఫ్యాక్షన్ రాజకీయాల గట్టని, బీజేపీ తమ జీవితాలను మార్చి అభివృద్ధి చేసే గట్టని ప్రజలు ఏ గట్టున ఉంటారో తేల్చుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కోరారు. నారాయణఖేడ్‌లో సంగప్ప తరపున ఆదివారం మంగల్‌పేట్ భవానీ ఆలయం నుంచి బయలుదేరి పట్టణ పుర వీధులగుండా రోడ్‌షో నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బసవేశ్వర చౌక్‌లో కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. మూడెకరాలున్న సామాన్యుడు బీజేపీ అభ్యర్థి జన్‌వాడే సంగప్పకు, మూడు వేల ఎకరాలున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు నడుమ యుద్ధం జరుగుతోందని తెలిపారు. ఫ్యాక్షన్ రాజకీయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి 70 ఏళ్లు మూడు కుటుంబాలే పెత్తనం చెలాయించి ఖేడ్ అభివృద్ధికి అడ్డుపడ్డాయన్నారు. ఇకపై ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని సంగప్ప అండగా తాము ఉంటారని భరోసా ఇచ్చారు. నిజాంసాగర్, నల్లవాగు, మంజీరా నది ఉన్నా గానీ పనులు, ఉద్యోగాలు లేవని, కనీసం పేదలకు ఇళ్లు కూడా లేని పరిస్థితి ఉండటం బాధాకరమన్నారు. ఇంతటి వెనుకబాటుతనం తాను ఎక్కడా చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ సర్వనాశనం చేస్తే ఇక్కడ స్థానికంగా మూడు కుటుంబాలు ఈ ప్రాంతాన్ని వెనుకబడేలా చేశాయన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే సంగప్ప ఈ గడ్డ రుణం తీర్చుకుంటారని హామీనిచ్చారు. ఆదిలాబాద్–ఖేడ్– పటాన్‌చెరుల మీదుగా రైల్వేలైన్ తీసుకు వస్తామని తెలిపారు. లింగాయత్, ఆరెమరా తాలను ఈబీసీలో చేర్చే పని కూడా 90 శాతం పూర్తయ్యిందని తెలిపారు. కార్యక్రమంలో కర్ణాటకలోని ఔరాద్ ఎమ్మెల్యే ప్రభుచౌహాన్, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి రవికుమార్, బీజేపీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్‌షోలో అభివాదం చేస్తున్న బండి సంజయ్

కర్ణాటక పరిస్థితి మనకొద్దు

అద్భుతమైన మేనిఫెస్టో బీఆర్ఎస్‌ది

- రాష్ట్రం అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్‌దే
- మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: గూట్లో రాయి తీయలేనోడు.. ఏట్లోని రాయి తీస్తాడా అన్నట్టు కాంగ్రెస్ పార్టీ వ్యవహారం ఉందని, కర్ణాటకలో మూడు గంటల కరెంట్ ఇస్తున్నారని, అలాంటి పరిస్థితి మనకు వద్దని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా పలు సంఘాలు మంత్రికి మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్ణాటక రైతులు కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేశామా అని బాధ పడుతున్నారని అన్నారు. వ్యవసాయం కోసం 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని అన్నారు. అద్భుతమైన మేనిఫెస్టోను బీఆర్ఎస్ ప్రకటించిందన్నారు. రైతు బీమా తరహాలో త్వరలో అందరికీ ఐదు లక్షల బీమా అందిస్తుందని, రేషన్ ద్వారా సన్న బియ్యం రానుందని తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. తెలంగాణ రాష్టాన్ని అన్నపూర్ణగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణలో అన్ని రంగాల్లో మార్పు వచ్చిందని అన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను గూర్చి వివరించాలని, మీరే బ్రాండ్ అంబాసిడర్లు కావాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. భవిష్యత్‌లో డిగ్రీ స్థాయిలో గురుకుల వ్యవస్థ అమలు చేస్తామని తెలిపారు. బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు.

21 సంఘాలు తీర్మానం..

మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా 21 సంఘాల ప్రతినిధులు ఏకగ్రీవ తీర్మాన పత్రాలు అందించారు.



నాయకులకు బీఆర్ఎస్ కండువాలు కప్పుతున్న మంత్రి హరీశ్ రావు

అంతకుముందు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, శివ ఆధ్వర్యంలో మంత్రి హరీశ్ రావు కు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలకలను సరిదిద్దుకోవడం గొప్ప విషయం

కొండపాక(గజ్వేల్): రాజకీయ అలకలను సరిదిద్దుకోవడం గొప్ప విషయమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బీజేపీకి చెందిన కుకునూరుపల్లి మండలం తిప్పారం సర్పంచ్ కర్నె లక్ష్మి, ఎల్లాయిగూడెం సర్పంచ్ రాములు ఆదివారం మంత్రిసమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మల్లన్న సాగర్ ముంపు బాధితుల సమస్యలు ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీర్చే బాధ్యత తనదంటూ భరోసా నిచ్చారు. రాజకీయ పరంగా అలకలు ఉన్నంత మాత్రాన ప్రజా ప్రతినిధులను ప్రలోభాలకు గురి చేస్తూ కాంగ్రెస్, బీజేపీల్లో చేర్చుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, వైస్ ఎంపీపీ సోమి భగవంతయ్య, సర్పంచ్‌లు కిరణ్‌కుమార్‌చారి, మహిపాల్, నాయకులు గొట్టం గోపాల్‌రెడ్డి, కోల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌షానే..

- గెలిచిన ఆరుగురిలో ముగ్గురు అమాత్యులే
- కాంగ్రెస్ హయాంలో బాగారెడ్డి, ఫరీదుద్దీన్, గీతారెడ్డిలకు చోటు



ఎం.బాగారెడ్డి



ఎం.డి.ఫరీదుద్దీన్



జె.గీతారెడ్డి

జహీరాబాద్: గతంలో నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆరుగురిలో ముగ్గురికి మాత్రం మంత్రివర్గంలో చోటు లభించింది. కాంగ్రెస్ హయాంలోనే ఎం.బాగారెడ్డి, ఎండీ ఫరీదుద్దీన్, జె.గీతారెడ్డిలకు మంత్రి పదవులు దక్కాయి. అప్పుడు కాంగ్రెస్ తరపున గెలిచిన పి.నర్సింహారెడ్డి, టీడీపీ తరపున గెలిచిన సి.బాగన్న, బీఆర్ఎస్ తరపున గెలుపొందిన కె.మాణిక్‌రావులకు మంత్రి పదవులు దక్కలేదు. అప్పుడు వారి ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయి.

1957 నుంచి 1985 వరకు జరిగిన ఏడు పర్యాయాలు వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎం.బాగారెడ్డి గెలుపొందారు. పలువురి మంత్రి వర్గంలో బాగారెడ్డికి చోటు లభించింది. చక్కెర పరిశ్రమలు, భారీ పరిశ్రమలు, పంచాయతీరాజ్ తదితర శాఖలను ఆయన నిర్వహించారు. 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎండీ ఫరీదుద్దీన్ మొదటి సారిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ ఎన్నికల్లో ఆయన తిరిగి గెలుపొందడంతో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి మంత్రి వర్గంలో చోటు లభించింది. వక్ఫ్, మైనార్టీ సంక్షేమం, మత్యశాఖలను నిర్వహించారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అప్పట్లో జహీరాబాద్ అసెంబ్లీ ఎస్సీలకు రిజర్వు కావడంతో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి గీతారెడ్డికి గజ్వేల్ నుంచి జహీరాబాద్‌కు మార్చారు. ఆ ఎన్నికల్లో ఆమె గెలుపొందడంతో భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా అవకాశం దక్కింది. 2014 ఎన్నికల్లో తాను ఓటమి పాలవ్వగా బీఆర్ఎస్ అభ్యర్థి కె.మాణిక్‌రావు గెలుపొందారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా ఆయనకు మాత్రం మంత్రివర్గంలో అవకాశం లభించలేదు.

పదవులు దక్కలేదు..

1989 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన పి.నర్సింహారెడ్డి గెలుపొందారు. రాష్ట్రంలో అప్పట్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఆయనకు మంత్రి యోగం కలుగలేదు. 1994 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన సి.బాగన్న ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పట్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. నాడు ముఖ్యమంత్రిగా ఉన్న నందమూరి తారకరామారావు ఆయనకు మంత్రివర్గంలో అవకాశం కల్పిస్తామని సీఎం పేషీ నుంచి ఆహ్వానం అందింది. మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి సైతం బాగన్న తన అనుచర గణంతో హాజరయ్యారు. చివరి వరకు వేచి చూసినా ఆయనకు పిలుపు రాలేదు. మంత్రి వర్గంలో చోటు లభించలేదు. దీంతో ఆయన అసంతృప్తితో వెనుదిరగడం అప్పట్లో చర్చనీయాంశమైంది.

నాచగిరి.. ఆధ్యాత్మిక ఝురి





నాచగిరి భక్తులతో పోటెత్తింది. ఆదివారం కార్తీక సత్యనారాయణస్వామి వ్రతాలతో కార్తీక శోభను సంతరించుకున్నది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విడతల వారీగా 90 సామూహిక వ్రతాలు కొనసాగాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్‌జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు నాచగిరి లక్ష్మీనరసింహస్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఓవైపు వ్రతాలు, మరోవైపు గోవిందనామాలతో క్షేత్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. – వర్గల్(గజ్వేల్)

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మెదక్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు శిలువను పాస్టర్ల సమక్షంలో చర్చి చుట్టూ ఊరేగించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అసిస్టెంట్ ప్రెసిబెటరీ ఇన్‌చార్జ్‌లు శ్రీనివాస్, జైపాల్ దైవ సందేశాన్ని ఇచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

తెల్లబంగారానికి మద్దతు ధర దక్కేనా?



పత్తి పంట


- జిల్లా వ్యాప్తంగా 3.58 లక్షల ఎకరాల్లో సాగు
- కొనసాగుతున్న పత్తి తీత పనులు

ఝరాసంగం(జహీరాబాద్): పత్తి మద్దతు ధర కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో సాగు అయింది. గత సంవత్సరం ధర నిలకడగా లేదు. ఆ సీజన్ చివరి వరకు పంట నిల్వ ఉంచుకుని, తక్కువ ధరకు అమ్ముకొని ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో వానాకాలంలో అత్యధికంగా దానినే సాగు చేస్తుంటారు. ఎకరా సాగు చేసేందుకు (విత్తనం వేసిన నాటి నుంచి తీసే వరకు) సుమారు రూ.35 నుంచి 40 వేల వరకు పెట్టుబడి వ్యయమవుతుందని రైతులు పేర్కొంటున్నారు. కౌలు రైతులకు అదనంగా పెట్టుబడులు అవుతాయి. రెండేళ్ల క్రితం.. పత్తి క్వింటాలుకు రూ.10వేల వరకు ధర ఉంది. ఇదే ధర వస్తుందని ఆశించిన రైతులు గత సంవత్సరం పంట నిల్వ చేసుకున్నారు. ధర నిలకడగా లేకపోవటంతో తక్కువ ధరకు అమ్మేసుకున్నారు. మరి కొంతమంది నేటికీ నిల్వ ఉంచుకున్నారు. ఈ సంవత్సరమైనా రూ.10వేల ధర పలుకుతుందేమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం రూ.7,020లు మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించింది.

దిగుబడిపై ప్రభావం

జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో 3.58లక్షల ఎకరాలలో పత్తి సాగు చేశారు. ఈ సంవత్సరం అధిక వర్షాలు కురియడంతో పంట సరైన విధంగా సాగు కాలేదని రైతులు వాపోతున్నారు. దీంతో ఎకరాకు సుమారుగా 10–12 క్వింటాలు రావాల్సి ఉండగా వర్షాభావ పరిస్థితులతో ఎకరానికి 5–8 క్వింటాలు మాత్రమే వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ సంవత్సరమైనా పంటకు గిట్టుబాటు ధరపై ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఎలాంటి లాభం రాలేదు



పత్తి క్వింటాలుకు రూ.10వేల మద్దతు ధర కల్పించాలి. 22 ఎకరాల్లో పంట సాగు చేశా. గత సంవత్సరం మంచి ధర వస్తుందేమోనని ఆశించా. సీజన్ ముగిసేంత వరకు వేచి ఉన్నా. చివరకు రూ.7వేలకు క్వింటాలు చొప్పున అమ్ముకున్నా. ఎలాంటి లాభం రాలేదు.

–గోపాల్‌రెడ్డి, పత్తి రైతు,గ్రామం. కక్కర్‌వాడ





ఆలయ రాజగోపురం ఎదుట భక్తుల సందడి, (ఇన్‌సెట్) స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

కొమురవెల్లి.. భక్తితో ప్రణమిల్లి

కొమురవెల్లి మల్లికార్జున ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. మల్లన్న మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణతో ఆలయ పరిసరాలు పులకరించాయి. కార్తీక మాసంలో మొదటి వారం కావడంతో భక్తులు ఆలయానికి వచ్చి గంగిరేణు చెట్టు ప్రాంగణంలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఒడిబియ్యం, కేశఖండన, గంగిరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించారు. – కొమురవెల్లి(సిద్దిపేట)

క్లుప్తంగా

యోగాతో ఓటుపై అవగాహన


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 'ఓట్' అనే ఆంగ్ల అక్షరాలతో విద్యార్థులు యోగాసనాలు వేసి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఆదివారం వ్యాసమహర్షి యోగా అసోసియేషన్ కార్యాలయంలో ఈ ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రముఖ యోగా శిక్షకుడు తోట సతీష్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్షేత్ర స్థాయిలో హోమ్ పోలింగ్ పరిశీలన


హోమ్ పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న మనోహ్మన్ ప్రసాద్, గరిమా అగర్వాల్

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం హోమ్ పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైందని అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్ తెలిపారు. హోమ్ పోలింగ్‌కు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, 80 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధుల ఇంటికి వెళ్లి అధికారులు హోమ్ పోలింగ్ ప్రక్రియ చేపట్టారు. చేగుంట, నార్సింగి మండలాల్లో దీనిని దుబ్బాక ఎన్నికల సాధారణ పరిశీలకులు మన్మోహన్ ప్రసాద్‌తో కలిసి ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నియోజక వర్గంలో హోమ్ పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక


జాతీయ పోటీలకు ఎంపికైన రితీష్

సిద్దిపేటజోన్: ఎస్జీఎఫ్ అండర్19 జాతీయ స్విమ్మింగ్ పోటీలకు సిద్దిపేట క్రీడాకారుడు రితీష్ ఎంపికయ్యాడు. హైదరాబాద్ సరూర్ నగర్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో బ్యాక్ స్ట్రోక్ 200 మీటర్ల స్విమ్మింగ్ నందు ద్వితీయ స్థానం సాధించి ఉత్తమ ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా కోచ్ ప్రవీణ్, డాక్టర్ మహేష్ అభినందించారు.

ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పట్నం భూపాల్, ప్రధాన కార్యదర్శిగా మ్యాడ శ్రీధర్, ఆర్థిక కార్యదర్శిగా వడ్లకొండ శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్‌లుగా మట్టపల్లి రంగారావు, మద్దుల రవీందర్‌రెడ్డి, ఖాతా యాదగిరి, రేకులపల్లి లింగారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా కుర్మివాడ రాజేందర్, బసవరాజు కనకయ్య, ఉపాధ్యక్షులుగా మొర గణేష్, లబిశెట్టి బిక్షపతి, తాళ్ల శ్రీనివాస్, యూసుఫ్, ముత్తినేని ఎల్లయ్య, అడిషనల్ జనరల్ సెక్రటరీగా నీలం గురువయ్య, జక్కుల చంద్రశేఖర్, కార్యదర్శులుగా కాల్వ శ్రీకాంత్, మురికి శ్రీనివాస్, రాచకొండ భూపాల్, మంగలిపల్లి శ్రీనివాస్, చిట్టంపల్లి శ్రీనివాస్, ఆర్థిక కమిటీ మెంబర్లుగా శ్రీనాథ్, ఎండి అలం, పోలీస్ యాదగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సాబెర్ అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు వ్యవహరించారు. పరిశీలకులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత రెడ్డిలు వ్యవహరించారు.

అరచేతిలో ప్రచార జోరు

- సోషల్ మీడియాలో అభ్యర్థుల ఎలక్షన్ వార్
- తెల్లవారక ముందే మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు
- అన్ని పార్టీలది ఇదే దారి..
- ప్రతీ అభ్యర్థికి ప్రత్యేక బృందాలు


నారాయణఖేడ్: శాసనసభ ఎన్నికల ప్రచారం సంగారెడ్డి జిల్లాలో ఊపందుకుంది. అభ్యర్థులు విజయం కోసం ఊరూవాడా తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియాలో కూడా ప్రచార జోరు పెంచారు. ఇందు కోసం ప్రత్యేకంగా మనుషులను నియమించుకుంటున్నారు. ఎప్పటికప్పుడు ప్రచార ఫొటోలు, వీడియోలు, తాజా అంశాల సమాచారం సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయిస్తున్నారు. ప్రచారంలో మాట్లాడిన అంశాలను టెక్స్ మెసేజ్‌లు పోస్ట్ చేస్తున్నారు. గతంలో సోషల్‌మీడియా గ్రూపులలో సభ్యుల పరిమితి సంఖ్య కేవలం 250 మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఆ సంఖ్య 1,200 వరకు చేర్చుకునే వెసులుబాటు ఉంది. ఇలా అనేక గ్రూపులను క్రియేట్ చేస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. చేరికల విషయాన్ని బిగ్ బ్రేకింగ్ న్యూస్ అంటూ ఫొటోలు, వీడియోలు, మ్యాటర్ ఆకట్టుకునే విధంగా గ్రూపుల్లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇలా నిత్యం సెల్‌ఫోన్లలో అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంటోంది.

క్షణాల్లో సమాచారం

గతంలో నాయకులు ఎక్కడైనా ప్రచారం చేస్తే మరుసటి రోజు పత్రికలు, టీవీల్లో కనిపించేది. ఇప్పుడు సోషల్ మీడియాను ప్రచారాస్త్రంగా వాడుకుంటున్నారు. తమ నేతలు ఎక్కడికి వెళితే అక్కడి నుంచే లైవ్ ద్వారా చూపిస్తున్నారు. హార్డ్ వర్క్ కన్నా స్మార్ట్‌వర్క్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ ఫలితం సాధించ వచ్చన్న నానుడి ఎన్నికల సమయంలో సోషల్ మీడియా ద్వారా రుజువు అవుతుంది.

నెట్ డాటా.. చార్జింగ్ ధమాల్..

ఉదయం కోడి కూత కూయక ముందే సెల్‌ఫోన్‌లోని గ్రూపుల్లో వచ్చే మెస్సేజ్ చప్పుళ్ళతో నిద్రలేవాల్సి వస్తుంది. ఆయా గ్రూపుల్లో వందలాది పోస్టులు వస్తున్నాయి. ఓ పక్క నెట్ డాటా ఖర్చు కావడంతోపాటు మరో పక్క చార్జింగ్ ఉండడం లేదని జనాలు వాపోతున్నారు. గ్రూపుల్లో ఒకే అంశంపై పదుల సంఖ్యలో ఫొటోలు పెట్టడం, వాటినే మరొకరు ఫార్వర్డ్ చేస్తుండడంతో విసుగు తెప్పిస్తుందని పేర్కొంటున్నారు. ఎంత విసుగు వచ్చినా ఏదైనా కామెంట్ చేస్తే ఎక్కడ ఏ నాయకుడు ఏమనుకుంటాడో అని సదరు వ్యక్తులు గమ్మున ఉంటూ భరిస్తున్నారు.



జర జాగ్రత్త

సోషల్ మీడియాపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా ఉంచింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడే పోస్టులు పెట్టాలని స్పష్టం చేసింది. ఇందుకు స్వచ్ఛంద నైతిక నియమావళి రూపొందించారు. ఇష్టమొచ్చినట్లు రాతలు రాసి ఫొటోలు పెడితే ఎవరైనా అభ్యంతరం చెబితే ఇరుక్కునే ప్రమాదం ఉంది. ప్రత్యర్థులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం అసభ్య పదజాలాన్ని ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అభ్యర్థులు, వారి అనుచరులు నియమావళిని ఉల్లంఘించిన వీడియోలు, ఫొటోలను పౌరులు ఎవరైనా ఎన్నికల సంఘానికి పంపించొచ్చు. సి-విజిల్ యాప్‌లో నమోదు చేయవచ్చు. పోస్టులు పెట్టేవారు సంయమనం పాటిస్తూ ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకొని అభ్యంతరకరం లేనివాటినే పోస్టు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తిగతంగా కించపరిచే పోస్టులకు దూరంగా ఉండాలి. ప్రత్యర్థి పార్టీల నేతలపై దూషణలకు దిగడం చట్టరీత్యా నేరం. తన పరువుకు భంగం కలిగినప్పుడు అవతలి వ్యక్తి పరువు నష్టం దావా వేసే అవకాశం ఉంది. రుజువైతే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదు.

పొదుపు డబ్బు స్వాహా..

న్యాయం చేయాలని మహిళల రాస్తారోకో


పందిల్ల రోడ్డు పై ధర్నా చేస్తున్న మహిళలు

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని పందిల్ల స్వకృషి మహిళా పొదుపు సంఘం గణకురాలు సరిత సంఘం డబ్బులు రూ.29 లక్షల వరకు స్వాహా చేసిందని, వాటిని ఇప్పించి న్యాయం చేయాలని మహిళలు ఆదివారం ధర్నా చేశారు. 20ఏళ్ల కిందట స్వకృషి మహిళా పొదుపు సంఘం ఏర్పాటు చేశారు. నెలకు రూ.50 చొప్పున మహిళలు పొదుపు చేసుకుంటున్నారు. వారికి ఎలాంటి జామీను లేకుండా రుణాలు ఇస్తున్నారు. సభ్యులు తీసుకున్న రుణాలను నెలనెలా వాయిదా క్రమంలో చెల్లిస్తున్నారు. అయితే సంఘం గణకురాలు సభ్యులకు తెలవకుండా రూ.29లక్షల వరకు రుణాలు తీసుకుని సొంతానికి వాడుకుందని సభ్యులు ఆరోపించారు. సంఘం ఆడిట్ సమయంలో డబ్బులు స్వాహా అయిన విషయం బయటకు వచ్చింది. వాటిని చెల్లించాలని మహిళలు డిమాండ్ చేయడంతో.. తన పేరు మీదున్న 20 గుంటల వ్యవసాయ భూమి పట్టా చేయిస్తానని ఆమె చెప్పడంతో రాజీకి వచ్చారు. గడువు తీరినా భూమి పట్టా చేయకపోవడంతో సభ్యులందరూ గణకురాలిని నిలదీశారు. డబ్బులు ఇచ్చేది లేదని ఆమె మొండికేయడంతో మహిళలు న్యాయం చేయాలని సిద్దిపేట, హన్మకొండ రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఆందోళన చేస్తున్న మహిళలకు సర్ది చెప్పి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అభివృద్ధిని చూసి కేసీఆర్‌ను గెలిపించండి


ఇస్లాంపూర్‌లో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్: అభివృద్ధికి పట్టం కట్టాలని.. కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని వట్టూరు, నాగులపల్లి, వెంకటరత్నాపూర్, దాతర్‌పల్లి, ఇస్లాంపూర్ గ్రామాలలో జెడ్పీటీసీ రాణి సత్యనారాయణగౌడ్, మాజీ ఫుడ్స్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, మండల ఇన్‌చార్జి విద్యాసాగర్, ఫాక్స్ డైరెక్టర్ సంతోష్‌రెడ్డిలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో జరగని అభివృద్ధి గజ్వేల్ నియోజకవర్గంలో జరిగిందని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని పేర్కొన్నారు. అక్కడక్కడా మిగిలి ఉన్న సమస్యలు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో పెంకుటిళ్లు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడంతో పాటు సీలింగ్, పోరంబోకు భూములకు పట్టాలు అందజేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు అమలు కాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని, వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ నిత్యావసరాల ధరలను పెంచి సామాన్యులపై భారం మోపిందన్నారు. నేడు కేసీఆర్‌ను ఓడించేందుకు కుల రాజకీయాలు చేస్తూ ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. పదేళ్లలో సమస్యల గురించి పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ నాయకులు.. నేడు అభివృద్ధి చేస్తామంటే ప్రజల నమ్మే స్థితిలో లేరని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి జరగాలంటే కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు ఊరూరా కళాకారులు ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుకన్య రమేష్, ఎంపీటీసీ నర్సమ్మ, మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, లక్ష్మణ్, నర్సింలు, భిక్షపతి, వెంకట్ రామ్‌రెడ్డి, శ్రీశైలం, రవీందర్‌గౌడ్, హైమాద్ పాల్గొన్నారు.



అక్కా.. కారుకే ఓటెయ్యాలె

వర్గల్(గజ్వేల్): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఆదివారం వర్గల్ మండలం మైలారంలో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించడంతోపాటు పంట పొలాల్లో పనిచేసే మహిళల దగ్గరికి వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.



ప్రతిపక్షాలను చుట్టేస్తా..

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలోని పలు కాలనీల్లో ఆదివారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో ఓ ఇంటివద్ద బీడీలు చుడుతున్న మహిళలకు వద్దకు వెళ్లారు. కాసేపు వారితో కలిసి బీడీలు చుట్టి.. కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..


బుదేరాలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

బీఆర్‌ఎస్ అందోల్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించి ఆశీర్వదిస్తే అందోల్ నియోజకవర్గంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని బుదేరా, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు బుదేరా గ్రామానికి చెందిన పలువురు గులాబీ పార్టీలో చేరారు. అనంతరం చౌరస్తాలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులను అభివృద్ధి చేయడానికే కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను తెలంగాణలో కేసీఆర్ అమలు చేసి చూపించారన్నారు. వివిధ రకాల పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సాయి కుమార్, విజయ్ కుమార్, భాస్కర్, నవాజ్‌రెడ్డి, మల్లేశం, గోపులారం సిద్దయ్య పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

రాయికోడ్(అందోల్): అందోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌కే ఓటు వేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని ఎనికెపల్లి గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లకు పైగా పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఆ పార్టీ అభ్యర్థులకు గెలిపిస్తేనే తిరిగి సంక్షేమ పథకాలు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో ఓరంగనగర్ సర్పంచ్ నాగరాజ్, సంగారెడ్డి, యాదగిరి, బస్వరాజ్ పాటిల్, శేఖర్‌రెడ్డి, నాగన్‌పల్లి సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, రామన్న పాటిల్, విజయకుమార్, నరేష్ పాల్గొన్నారు.

అధిక మెజారిటీతో గెలిపించాలి

మునిపల్లి(అందోల్): తెలంగాణ ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి పర్చడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాహుల్ కిరణ్ అన్నారు. ఆదివారం మండలంలోని మేళసంగ్యం చౌరస్తాలో పలువురు గులాబీ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దని, ప్రలోభాలకు లోనుకాకూడదన్నారు. చంటి క్రాంతికిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు కుత్బుద్దీన్, నర్సింలు, నారాయణ, మణెమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఖేడ్


కల్హేర్: ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: పదేళ్ల కేసీఆర్ పాలన ఘనమైన అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు సాగుతోందని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. ఖేడ్ మండలంలోని ర్యాకల్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో, విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరింత అభివృద్ధికి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, సర్పంచ్ సుజాత గుండారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సాయాగౌడ్, అంజిరెడ్డి, అంజయ్య, గోపాల్‌రెడ్డి, అంజాగౌడ్ పాల్గొన్నారు. ఈనెల 24న ఖేడ్‌లో నిర్వహించనున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్ రోడ్‌షో, 26న హోంమంత్రి మహమూద్ అలీ రోడ్‌షోను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. తనను మళ్లీ గెలిపిస్తే సిద్దిపేట, గజ్వేల్ తరహాలో అభివృద్ధి చేస్తానని, కర్మాగారాలు తెస్తానని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, నాయకులు ముజమ్మిల్, రామకృష్ణ, వియ్‌బుజ్జి, చెన్‌బసప్ప, జైపాల్‌రెడ్డి సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అభ్యర్థి భూపాల్‌రెడ్డి సమక్షంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

మరోసారి ఆశీర్వదించండి

మనూరు(నారాయణఖేడ్): నియోజకవర్గాన్ని తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుంచి అన్ని విధాలా అభివృద్ధి పథంలో తీసుకెళ్లానని బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగల్‌గిద్ద మండలం ఔదత్‌పూర్, ఏస్గీ, కారముంగి, కరస్‌గుత్తి, శేరిదామర్‌గిద్ద తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు మరోమారు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పండరి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు పండరియాదవ్, ప్రహ్లాద్, ఉత్తంరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే విజయానికి దోహదం

కల్హేర్(నారాయణఖేడ్): కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఎన్నికల్లో గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఎం.విజయపాల్‌రెడ్డితో కలిసి మార్డి, బీబీపేట, మునిగేపల్లి, సిర్గాపూర్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు చేసిన బీఆర్‌ఎస్ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ముందుగా ఆయా గ్రామస్తులు మంగళ హారతులతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంసింగ్, ఎంపీపీలు గుర్రపు సుశీల అంజయ్య, మహిపాల్ రెడ్డి, జెడ్పీటీసీలు నర్సింహారెడ్డి, రాఘవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెసోళ్ల మాటలు నమ్మొద్దు

బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్


కందిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖాజాఖాన్


సదాశివపేట 14వ వార్డు ప్రచారంలో అభివాదం చేస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. తమ పాలనలోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అమలు సాధ్యమని తెలిపారు. ఆదివారం పట్టణంలోని 1, 9, 10, 11, 12, 13, 14, 25, 26వ వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు అడుగడుగునా మహిళలు మంగళ హారతులు, గజమాలలతో భారీగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందే అహంకారంతో రైతులకు మూడు గంటల కరెంట్ చాలని మాట్లాడిన కాంగ్రెస్ నేతలను నమ్మితే నిండా ముంచుతారని విమర్శించారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంట్, ఇంటింటికీ మిషన్ భగీరథ తాగునీరు తదితర పథకాల అమలు రాష్ట్రంలో తప్ప దేశంలో ఎక్కడా లేవన్నారు. ఎన్నికలు రాగానే బయలుదేరే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పగటి వేషగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లోడి జయమ్మ, వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చే ప్రభాకర్‌ను గెలిపించాలి

కంది(సంగారెడ్డి): అందరికీ అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేసే చింతా ప్రభాకర్‌ను గెలిపించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖాజాఖాన్ కోరారు. ఆదివారం మండలకేంద్రమైన కందిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌కు మద్దతుగా ఖాజాఖాన్ ఆధ్వర్యంలో పాత కంది, కొత్త కంది, లక్ష్మీనగర్లలో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. మరింత అభివృద్ధి జరగాలంటే ఆయనను గెలిపించాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోని కాంగ్రెస్ అభ్యర్థిని నమ్మి మోసపోవద్దన్నారు. ప్రచారంలో పార్టీ నాయకులు, వార్డు సభ్యులు, మైనారిటీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిద్దిపేట ప్రగతి కోసం నిరంతర కృషి

మంత్రి హరీశ్ రావు


పాటల సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్

సిద్దిపేటజోన్: ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ అంటే తనకు చాలా అభిమానమని, తమ్ముడు ఎన్నికల్లో తన కోసం పాట రాసి సీడీ రూపంలో తయారు చేయడం సంతోషంగా ఉందని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో హరీశ్ మీద రాహుల్ రూపొందించిన పాట సీడీని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం రాత్రి మంత్రి నివాసంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...సిద్దిపేట ఇమేజ్ మెజార్టీ అని, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అన్నింటిలో ఆదర్శంగా ఉన్న సిద్దిపేట మెజార్టీలో టాప్‌గా నిలవాలని కోరారు. శక్తి మేరకు సిద్దిపేట ప్రగతి కోసం పాటుపడతా, పోలింగ్ శాతం పెరగాలి, అందరూ ఓటుహక్కు వినియోగించే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి పాల్గొన్నారు.